దేవగాథాలహరి

# నరకాసురవధ

-లోడేపల్లి భాగ్యలక్ష్మి మాధవ్




పాల సంద్రంలోని అలలు ఏర్పరచిన నురుగు తెల్లని ధవళ కాంతుతో వింత, వింత రంగులతో మెరిసి పోతోంది. పాల వెన్నెలలా... స్వచ్ఛంగా ఉండే ఆ నురుగు... అలవోకగా భర్త పాదాలు నొక్కుతూ... ఛలోక్తులు విసురుతూ... అటూ... ఇటూ నాగులా శిరసు నూపుతున్న లక్ష్మీదేవి నవరత్నాభరణాల కాంతి నీటిపై తేలి నురుగును చేరి... సప్త రంగుల్ని సృష్టిస్తోంది. తత్ ఫలితమే తెల్లని ఆ నురుగు వింత వింత రంగుల్తో మెరవటం... లక్ష్మీదేవి మాటలనూ... ఆమె చలోక్తులకూ... పరవసుడైన ఆదివిష్ణు... సర్వాన్ని మరచి ఆమెనే తదేకంగా చూస్తున్నాడు.

"వారి ఆనందాన్నే కాకుండా... వారి సరస సంభాషణలను సైతం వింటూ... శ్రీ మన్నారాయణుని లోని... భక్తి... ముక్తి... రక్తిగా గల నవరసాలనూ ప్రత్యక్షంగా అనుభవించే తనెంత ధన్యుడు! దుష్ట శిక్షణార్థం అయిన ఏతే అవతారాలలో సహితం తన పాత్ర ఉండటం ఎంత అదృష్టం శేషనాగు పరవశంగా కళ్ళు మూసుకున్నాడు. ఆయన హృదయం భక్తితో నిండిపోయింది.

సరస సల్లాపాలలో మునిగిన ఆ దంపతులు పరిసరాలనే మర్చి పోయారు.

"నాథా! ఎక్కడో... దీనంగా... బాధగా... హృదయాలను పిండే ఆర్తనాదం!"

"సర్వం మరచిన శేషు ఉలిక్కి పడ్డాడు ఆ ఆర్తనాదానికి."

శృంగార రసాస్వాదనలో మునిగిన ఆ దంపతులు ఇహ లోకంలోకి వచ్చారు. వారి ముఖాలు కళాహీనమై పోయాయి. ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"స్వామీ! ఆ పిలుపు... అక్కగారిది... ఆమె మాట పూర్తి కానేలేదు"

"అవును దేవీ! ఆ గొంతు భూదేవిదే! ఏ అనర్థం జరిగిందో... ఏమో!..." సాలోచనగా అన్నాడు నారాయణుడు.

"మరి అలా నిమ్మకునీరెత్తినట్లు... ఉండి పోయారే మిటండీ!" కంగారుగా అడిగింది లక్ష్మీదేవి.

"సర్వాంతర్యామి అయిన తనకి భార్య అయి వుండి కూడా... ఒక సామాన్య స్త్రీలా... అలా కంగారు పడుతున్న భార్యను చూసి నవ్వుకున్నాడు విష్ణుమూర్తి."

"తననో పిచ్చిదానిలా చూసి నవ్వుతున్న భర్తను చూసేసరికి లక్ష్మీదేవికి విపరీతమైన కోపం వచ్చింది. ఒక్కసారి తీక్షణంగా భర్త వంక చూసి ముఖం ప్రక్కకు తిప్పుకుంది, కోపంగా."

క్షణం క్రితం చూడ ముచ్చటగా ఉన్న ఆ దంపతులు ఏదో తెలియని బాధతో అలా ఎడముఖం, పెడ ముఖంగా ఉండే సరికి ఆదిశేషుకి చాలా బాధ కలిగింది.

"నాథా!... నాథా... తిరిగి అదే పిలుపు."

ఈసారి అలా మౌనంగా ఉండలేక పోయాడు నారాయణుడు. ఒక్కసారి లేచి నుల్చున్నాడు. లక్ష్మీదేవి కూడా లేచి నుల్చుంది. ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది.

దూరంగా ఆర్తిగా పిలుస్తూ... భూదేవి...

తన అర్ధాంగి!...

"విష్ణు వదనంతో బాధా తప్త హృదయంతో... సహన మూర్తి భూదేవి. ఎన్ని బాధలొచ్చినా ఎన్ని కష్టాలొచ్చినా... సహనంతో భరించే భూదేవి... అలా దీనంగా తననే... పిలుస్తూ... కనపడే సరికి నారాయణుడు కదిలిపోయాడు."

అక్కగార్ని ఆ రూపంలో ఎపుడూ చూడని శ్రీదేవి... వేగంగా ఎదురెళ్ళి ఆమెని కౌగిలించుకుంది అక్కా! అంటూ.

వారిని ఆ స్థితిలో చూసిన శేషుకి కళ్ళ వెంట నీరు జారింది. ఏమయింది దేవీ!... ఏమిటీ ఆక్రందన? ఎందుకలా బాధపడుతున్నావు? భార్య చేయి పట్టుకుని నెమ్మదిగా తీసుకొచ్చి... శేషు మీద కూర్చో బెట్టాడు. తనుకూడా ప్రక్కనే కూర్చున్నాడు. శ్రీదేవి అక్కగారి సమాధానం కోసం ఎదురు చూస్తూ అలాగే నిలుచుండి పోయింది.

"స్వామీ!" దుఃఖంతో మాట రావటం లేదు భూదేవికి.

"చెప్పు! దేవీ! ఎందుకీ ఆవేదన.." లాలనగా అడిగాడు విష్ణుమూర్తి.

"నీకింత పక్షపాతం తగదు!..." కారుతున్న కన్నీటికి తుడుచుకుంటూ అంది భూదేవి.

అనుకోని అభాండం అశనిపాతంలా... తగిలింది వైకుంఠవాసునికి.

"అదేమిటి దేవీ! ఆశ్చర్యంతో పాటు అసహనంగా కూడా అడిగాడాయన."


"అవును! స్వామీ! పక్షపాతం కాక మరేమిటి చెప్పండి... కష్టాలూ... కన్నీళ్ళు నావంతా? మురిపాలూ.. ముచ్చట్లూ ఆమె వంతా? అయినా ఒక్కనాడు కూడా నేను నోరు తెరచి అడగలేదే! అదీ కాక దుష్ట శిక్షణార్థం అంటూ మీరు ఎత్తే ప్రతి అవతారంలోనూ... మీ ముద్దుల రాణిగా శ్రీదేవి తప్ప నేను తగనా! ఉక్రోషంగా అడిగింది భూదేవి.

"తనని ప్రత్యేకంగా ఎత్తి చూపుతూ... భర్తను నిలేస్తున్న భూదేవిని చూసి... అప్పటిదాకా ఆమెని చూసి బాధ పడ్డ శ్రీదేవికి కోపం ముంచుకొచ్చింది. తను మాత్రం ఏం సుఖపడింది? ఏ అవతారంలోనైనా తనకీ కష్టాలు తప్పలేదు. త్రేతాయుగంలో సీతగా జన్మించి భర్త వియోగంతో పాటు అరణ్య వాసంలో కష్టకష్టాలూ పడలేదా? పెద్ద తనేదో సుఖ పడిపోతు న్నట్లూ... అన్ని కష్టాలూ తనకే అన్నట్లు తెగ బాధ పడిపోతోందే! శ్రీదేవికి అక్కగారి మీద తొలిసారిగా సవతి మీద కలిగే ఈర్ష్యా భావన కలిగి..." స్త్రీ సహజగుణాన్ని బయట పరుచుకుంది.

"ఇంతమాట అనకు దేవీ! ఎపుడూ లేనిది ఏమిటీ అల్పత్వం! ఎందుకింత బాధ పడుతున్నావు? అసలేం జరిగింది? లాలనగా భార్య కన్నీరు తుడుస్తూ అడిగాడు ఆదివిష్ణు.

భర్త మాటలకు కొంచెం తెప్పరిల్లింది భూదేవి.

ఏం చేయాలో చెప్పండి! భూలోకంలో పాపం పెరిగి పోయింది. తగని భారం ఎక్కువయి పోతోంది. ఈ భారాన్ని నేను మోయ లేకుండా ఉన్నాను...



"నేను పనిమానేసి వెళ్ళిపోతున్నాను సార్"

అన్నాడు నౌకరు.

"ఏం? ఎందుకని? అని ఆశ్చర్యపోయాడు యజమాని. మీకు నా మీద నమ్మకం లేదుగదా!" అన్నాడు నౌకరు.

"అదేమిటి? మొన్న తాళం చెవులగుత్తి కూడ నీకు వదిలేసి వెళ్లామగదా?" యజమాని.

అయితే ఏంలాభం. అందులో ఒక్కటీ ఇనప్పెట్టెకు పట్టేది లేదు నౌకరు అన్నాడు.

— బి.యం. శ్రీనివాస్.

"అంటే?"

"ఏం చెప్పమంటారు? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందన్నట్లుగా కన్నకొడుకు... అదే... ఆ నరకాసురుని ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. తల్లికాక మరెవరు భరిస్తారని ఇంతకాలం ఎంతో ఓర్చుకున్నాను... ఇక నా వల్ల కాదు... దుష్ట శిక్షణార్థం... మీరు మరో అవతారం ఎత్త వలసిందే! గాద్గదికంగా అడిగింది భూదేవి.

ఆయనను అలా చూసేసరికి భూదేవి, శ్రీదేవి ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

మౌనంగా కళ్ళు మూసుకున్నాడు నారాయణుడు.

ఆయన కళ్ళముందు భూలోకం లోని నరకం అంతా గిరగిరా తిరిగింది.

అంతే! ఒక్కసారి చిరునవ్వు నవ్వాడు.

అమృత మయమైన ఆదరహాసం ఆ అతివల మనసులోని ఆందోళనను పారద్రోలి వారి మనసులను స్వచ్ఛంగా చేసింది.

నెమ్మదిగా కళ్ళు తెరిచాడు నారాయణుడు.

"భూదేవీ..."

"నాథా..."

"చూడు! నువ్వన్నదీ... నీ మనసు పడే వేదనా రెండూ నిజమే... ఆ నరకాసురుని ఆగడాలు నాకు తెలుసు. కానీ ఇంతకాలం... నేను మౌనంగా ఉండటానికి గల కారణం నీకు తెలియదు" ఆగాడు నారాయణుడు.

ప్రశ్నార్థకంగా భర్త ముఖంలోకి చూసింది భూదేవి.

ఆ నరకాసురుడు ఎంత భయంకరమైన వ్యక్తో... అంత భక్తుడు కూడా. అందుకే అహంకారంతో... ఉచ్చ నీచాలు ఆలోచించక... ఆదరానివి వరాలు అడిగాడు. అందులోని ముఖ్య వరం, దేవతల చేతగానీ... రాక్షసుల చేతగానీ, దాయాదుల చేతగానీ... ఏ జంతువులతో గానీ తనకి మృత్యువు సంభవించకూడదు అన్నది. ఆ వరం పొందే దాకా అవిరామంగా తపస్సు చేశాడు. ఆ వరాన్ని పొందాడు. అతని సహచరులు అతన్ని ఓ ప్రశ్న వేశారు. అదేమిటంటే అన్నదమ్ములు వలనగానీ, మరెవరి చేతగానీ మృత్యువు రాకూడదని కోరుకున్నావే గానీ కన్నతల్లిని మర్చిపోయావేం? అని.

దానికి అతని సమాధానం ఏమిటో తెలుసా? కన్నతల్లా!... అందునా...ఓ ఆడదా? నన్ను చంపేది! పిచ్చిగా నవ్వాడు. ఆ అహంకారమే... అతని చావుని అతనికి తెలియకుండా చేసింది.

"అంటే..."

"అంటే... రోగి పాలే కోరాడు... వైద్యుడూ పాలే ఇచ్చాడు.. అన్నట్లుగా... నీవు నీకు తెలియకుండానే... నన్ను నిందిస్తూనే.. నా కర్తవ్యం నాకు గుర్తు చేశావు."

"అదేమిటి... స్వామీ!..."

"అవును! దేవీ! నను నీ మీద పక్షపాతం చూపిస్తున్నానన్నావు కాదా... అందుకే ద్వాపర యుగంలో శ్రీ కృష్ణావతారం ఎత్తక తప్పదు. ఎపుడూ కష్టాలపాలై బాధపడే నీవు... ఆ జన్మలో... నా ముద్దుల భార్యవై.. తద్వారా... లోక కల్యాణానికి కారకురాలివి అవుతావు. సరేనా! అపుడు నీ ఇష్టం! ఈనీ నాథుడు.. నీ దాసాను దాసుడు.." కొంటెగా భూదేవి వంక చూశాడు వైకుంఠమూర్తి.

సిగ్గుతో తలవంచుకుంది భూదేవి.

"సరక్కా! ఆయనెపుడూ అంతే! అక్కగారి చేయి అంది పుచ్చుకుంది శ్రీదేవి."

వారి అన్యోన్యతకి తనలో తానే నవ్వుకున్నాడు నారాయణుడు. తేలికగా నిట్టూర్చాడు ఫణిరాజు.

★★ ★★ ★★★ ★★★

"నాథా! ఆ కాలంలో ఈ యుద్ధ ప్రయత్నాలేమిటి? ఎక్కడికి?..."

"ఏమీ కాదు సత్యా! ఆ నరకాసురుడి ఆగడాలు రోజురోజుకీ మితి మీరు పోతున్నాయి. ఎంత ఓపిక పడదామన్నా... మునులు, ప్రజల ఘోష విని సహించలేక పోతున్నాను. ఇక వాడికి చివరి ఘడియలు సమీపించాయి."

"విల్లు... బాణాలు సరి చూసుకుంటున్న భర్తను అలా చూస్తూండి పోయింది సత్యభామ... ఆమెలో ఓ వింత కోర్కె మొలకెత్తింది. అసలు తన భర్త యుద్ధం ఎలా చేస్తారు? వేణుగాన మాధుర్యంతో గోపికలనూ, గోవులనే కాక సర్వ జీవరాశులను పరవశింప చేసే ఆమోహన మూర్తి చేతిలో మురళి బదులు కరకు కత్తి ఎలా పట్టుకుంటారు! విల్లు ఎలా సంధిస్తారు... ఒక్కసారి భర్తని ఆ రూపంలో ఊహించుకుంది. ఊహూ!... అయినా... ఆమెకి తృప్తి కలుగలేదు. ఎలా... ఎలా... ఎలాగైనా భర్త నొప్పించి... నరకాసుర వధ కళ్ళారా చూడాల్సిందే... తలచుకున్నదే తడవుగా ఆచరణలో పెట్టేసింది."

"నాథా!... గోముగా పిలిచింది సత్యభామ."

ఉన్నట్లుండి భార్యగొంతులోని మార్పుకి చిత్రంగా

చూశాడు శ్రీకృష్ణుడు.

నెమ్మదిగా ఆయన దగ్గరకు చేరి ఆయన మెడ చుట్టూ చేతులు వేసింది.

తన ముద్దుల భార్య మనసేమిటో తెలిసిన కృష్ణునకు... ఆమె చెప్పకుండానే ఆమె కోర్కె అర్థం అయిపోయింది.

లాలనగా... ఆమె ముంగురులు సవరించాడు.

"సత్యా! తీయగా పిలిచిన భర్తను ప్రేమగా చూసింది సత్యభామ."

"మిమ్మల్ని ఒక్కమాట అడగనా?..."

"అడుగు! ఎందుకలా సందేహిస్తున్నావు... భార్య నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరగా లాక్కున్నాడు కృష్ణుడు."

"మరీ... మరీ... మిమ్మల్ని యుద్ధ రంగంలో చూడాలని ఉంది. అందుకనీ... ఆయన గుండెల మీద తలవాల్చింది సత్యభామ."

"ఫక్కున నవ్వాడు కృష్ణుడు."

"బుంగమూతి పెట్టింది సత్యభామ."

"అవును సత్యా! లేకపోతే యుద్ధరంగానికి రావటమేమిటి?"

"ఏం? నేను రాకూడదా? బుంగమూతితో అడిగింది సత్య."

"అక్కడ చాలా భయంకరంగా ఉంటుంది. ఆ రక్తపాతం, ఆహింస..." కృష్ణుని మాటలు పూర్తి కాలేదు.

"చాల్లెండి. వద్దని చెప్పరాదూ! ఇది వరకు ఓసారి నేను మీతో యుద్ధ భూమికి రాలేదా! అపుడు మీ మన్ననలను పొందలేదా? అవునూ... అపుడు మీరు నాకు రెండు వరాలిచ్చారు కదా! ఇపుడీ వరం ఈయండి..." మరింత ముద్దుగా అడిగింది సత్యాభామ.

ఆమె నోట ఆ మాట ఎపుడు వస్తుందా... అని ఎదురు చూస్తున్న మాయావి... చిరునవ్వు నవ్వాడు.

"సరే! నీ ముచ్చట నేనెందుకు కాదనాలి? అవసరమయితే నువు కూడా యుద్ధం చేయాలి సుమా!" వెక్కిరింతగా అన్నాడు కృష్ణుడు.

"ఏం నేను యుద్ధం చేయలేనా... అసలు మీరు అలా చూస్తూ రథం మీద కూర్చోండి.. ఆ దుర్మార్గుడిని నేను సంహరిస్తాను..." మెరుస్తున్న కళ్ళతో ధీమగా అంది సత్యభామ.

"అదీ... నాక్కావలసింది. బయలుదేరు మరి!"

ఒక్కసారి ఆనందంగా చిన్న పిల్లలా గంతులేసింది సత్యభామ.

అది చూసిన శ్రీకృష్ణుడు తనలో తానే నవ్వుకున్నాడు. ఆ విధంగా నరకాసుర వధకు నాంది ప్రస్తావన జరిగింది.

★★ ★★ ★★★ ★★★

"నరకాసురుడు వేసిన బాణాలతో అలసిపోయి కళ్ళు మూసుకున్న భర్తను చూసి సత్యభామ బాధపడింది."

"అంతే! అగ్నిలా మండి పడుతూ... భర్త చేతిలోని విల్లంబులందుకుని నారకాసురుని మీద శర వర్షం కురిపించసాగింది. ఆమె వేసే ప్రతిబాణం... అతని శరీరంలో గుచ్చుకోసాగింది. ప్రతిసారీ... అమ్మా! అని ఆక్రోశించే అతని కేకకి... ఎక్కడో సత్యభామ హృదయాంలో ఆమెకి తెలియకుండానే అలజడి మొదలయింది."

"ఆమె ధాటికి ఆగలేక... నరకాసురుడు నేల కూలాడు, అమ్మా" అని గట్టిగా అరుస్తూ.

"ఆ కేక... సత్యభామ హృదయాంతరాళ్ళలో ప్రతిధ్వనించింది."

"అపుడే నిద్రలోంచి లేచినట్లుగా కళ్ళు తెరచిన కృష్ణుని వంక బేలగా చూసింది."

"కృష్ణునికంతా అర్థం అయిపోయింది, ఆ మాతృ హృదయం పడే ఆవేదన."

ఆమెకి తెలియకుండానే మదన పడుతున్న సత్యభామని చూచి, కృష్ణుడు కూడా ఒకింత చలించాడు.

"సత్యా! నువ్వు నాకంటే గొప్పదానివి సుమా! నరకాసురుని ధాటికి నేనే ఓర్చుకోలేక పోయాను. కానీ నువ్వు ధైర్యంగా అతనిని ఎదుర్కోనటమే కాకుండా... అతనిని నేలకూల్చావు.. పొగుడుతున్న భర్త మాటలు ఆమెకేమీ వినపడటం లేదు! ఆమె మనసులో అమ్మా! అన్న నరకాసురుని గొంతు మాత్రం వినిపిస్తోంది."

భార్య ముఖంలోని బాధను గమనించిన కృష్ణునికి జాలి వేసింది.

"సత్యా! భుజం మీద చేయి వేసి దగ్గరకు తీసుకున్నాడు."

"పద! నరకాసురుని చూద్దాం! నెమ్మదిగా నడిపించుకుంటూ నరకాసురుని చేరారిద్దరూ."

"సత్యభామని చూడగానే... నరకాసురుని కళ్ళు వింతకాంతితో మెరిశాయి."

"అమ్మా! ఎంత పని చేశావు తల్లీ! నీ కొడుకునే నీవు చంపావుకదమ్మా గుచ్చుకున్న శరాలను ఒక్కొక్కటీ శరీరాన్నించి తీస్తూ... బాధగా అన్నాడు నరకాసురుడు."

"నేను నీ తల్లినా! నువ్వు నా కొడుకువా! ఏమిటీ వింత! తనలోని అలజడికి కారణం ఇదా!"

"అవును తల్లీ... నేను నీ కొడుకునే... ఎవరి వల్లా నాకు చావు రాకూడదని వరం కోరుకున్నానే తప్ప... కన్నతల్లి వల్ల రాకూడదని కోరుకోలేదు. ఎందుకంటే... కన్నతల్లి ఎక్కడయినా కొడుకుని చంపుతుందా? మాతృ హృదయంలో అమృతానికి బదులు హాలాహలం ఉంటుందా... అందుకేనమ్మా! నేను వరం కోరుకోలేదు. కానీ... కానీ... నువ్వే నన్ను చంపావు! అంటే కన్నతల్లి చేతిలోనే నా చావు రాశాడు ఆ బ్రహ్మ! అయినా నేనెంత అదృష్టవంతుడిని.... చివరిసారిగా నా ప్రణామాలు అందుకో తల్లీ!" రెండు చేతులు జోడించాడు.

సత్యభామ కదిలి పోయింది బాధతో.

"ఏమటండీ! ఈ ఘోరం! ఇదంతా నిజమేనా! విలపిస్తున్న సత్యభామని ఓదార్చాడు శ్రీకృష్ణుడు."

"చూడు! సత్యా! అసలు నువ్వెవరో గుర్తు తెచ్చుకో! అసలు నన్నేంకోరావో... అసలు ఈ అవతారానికి అర్థం ఏమిటో అన్నీ గుర్తు తెచ్చుకో..."

ఒక్కసారి సత్యభామకి మాయ పొర కప్పింది.

"గతం కళ్ళముందు తిరిగింది."

"భూమాత అయిన తను విష్ణుమూర్తికి నరకాసురుని వధించి... ప్రజల బాధలు పోగొట్టమని కోరటం... విష్ణుమూర్తి ద్వాపర యుగంలో తన అవతారాలు చెప్పటం... అంతా ఆమె కళ్ళముందు తిరిగింది. నరకాసురుని వికృత కృత్యాలు కళ్ళముందు తిరిగాయి."

అవును! భూభారం తీర్చటానికి విష్ణుమూర్తి కృష్ణునిగా... ఆయన ముద్దుల భార్య సత్యభామగా ఈ జన్మనెత్తారు... నిజ! నరకాసుర వధతో ప్రజల పీడ వదిలింది. ఒక్కసారి నరకాసురుని చూచింది. దీనంగా తననే చూస్తున్న అతనిని ఆశీర్వదించింది.

రెండు చేతులూ జోడించాడు నరకాసురుడు. అతని ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమయిపోయాయి. అతని ఆత్మ విష్ణుమూర్తిలో లీనమైంది.

"లోకం అంతా పండగ చేసుకుంది.

"అదే నరకాసుర వధ."

అయితే... ఇప్పటి నర(కా)సురులను వధించే దెవరు ?

